అనుదినం జనస్వరం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 09 ఫిబ్రవరి 2023

1

వెంకట్రావు పేట్‌లో కొండచిలువ కలకలం

నవతెలంగాణ-లక్సెట్టిపేట్



మండలంలోని వెంకట్రావుపేట్ గ్రామ చెరువు శివారులోగల గుట్ట ప్రాంతంలో బుధవారం కొండ చిలువ ప్రత్యక్షమైంది. స్థానికులు గుట్టపైకి వెళుతున్న క్రమంలో గుట్టపై గల ఒక బొరియలో కొండచిలువను చూసి సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోను పెట్టడంతో అది కాస్త వైరల్‌గా మారింది. కాగా, గతంలో ఇదే ప్రాంతంలో ఒకేసారి 11 కొండచిలువలు కనబడగా వాటిని అటవీ శాఖ అధికారులు సురక్షిత ప్రాంతంలో వదిలి పెట్టారు. ఇదిలా ఉండగా, చెరువు సమీపంలో పొలం పనులు చేసుకునే రైతులు, కూలీలు, పశువుల కాపరులు కొండచిలువలతో భయాందోళనకు గురవుతున్నారు.

గ్రీన్ కారిడార్లో మొక్కలు నాటాలి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణకు హరితహారం కార్యక్రమం గ్రీన్ కారిడార్లో భాగంగా జాతీయ రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షించే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్ నుండి జైపూర్ వరకు చేపట్టిన గ్రీన్ కారిడార్ కార్యక్రమంలో జాతీయ రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంతో పాటు సహజ వాయువు అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. తెలంగాణకు హరితహారంలో భాగంగా చేపడుతున్న గ్రీన్ కారిడార్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ కమీషనర్ రమేష్ పాల్గొన్నారు.

ఏసీడీ ఛార్జీలు రద్దు..!

పేదలపై మోపిన కరెంటు ఛార్జీల భారాన్ని ఆ శాఖ వెనక్కి తీసుకుంది. ఏసీడీ (అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్) ఛార్జీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.వీటికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. విద్యుత్‌శాఖ తాజా నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగిస్తోంది. ఇప్పటికే ఆర్థికభారంతో ఇబ్బందులు పడుతున్న ఈ వర్గాలు ఏసీడీ ఛార్జీలు విధించడంతో మరింత ఆందోళనకు గురయ్యారు. అసలు బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న పేదలకు ఏసీడీ ఛార్జీలు కూడా ఒకేసారి చెల్లించాల్సి రావడంతో కంగుతిన్నారు. ఒక్కొక్కరికి రూ.వేలల్లో అదనపు బిల్లులు రావడంతో ఆ శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాల్లో ఆగ్రహం పెల్లుబిక్కడంతో ఆ శాఖ తీరుపై ఎక్కడికక్కడ నిరసన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల విద్యుత్‌శాఖ అధికారులను నిర్బంధించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఛార్జీల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం కావడంతో వీటిని రద్దు చేస్తూ ఆ శాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

- జనాగ్రహానికి వెనక్కి తగ్గిన విద్యుత్‌శాఖ
- తాజా నిర్ణయంతో పేదలకు ఉపశమనం
- అధికారిక ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కిందటేడాది డెవలప్‌మెంట్ ఛార్జీల రూపంలో అదనపు విద్యుత్ ఛార్జీలను వసూలు చేసింది. కరెంటు వినియోగాన్ని బట్టి ఏడాదికోసారి ఇలాంటి ఛార్జీలు వస్తాయని అప్పట్లో విద్యుత్‌శాఖ అధికారులు చెప్పడంతో జనం గత్యంతరం లేక వాటిని చెల్లించారు. తాజాగా ఈ ఏడాది సైతం ఏసీడీ పేరిట మరో సారి అదనపు ఛార్జీలు వేయడంతో జనం తట్టుకోలేకపోయారు. ఇవి కేవలం డిపాజిట్ మాత్రమేనని సర్వీసు తొలగించుకున్న తర్వాత వీటిని తిరిగి చెల్లిస్తామని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందుకు వడ్డీ కూడా జమ అవుతుందని చెప్పారు. కానీ జనం మాత్రం వీటిని అంగీకరించలేదు.మీటరు సర్వీసును భవిష్యత్తులోనూ తొలగించుకునే అవకాశం లేకపోవడంతో ఈ ఛార్జీలను చెల్లించలేమని స్పష్టం చేశారు. మరోపక్క ఇది వరకే విద్యుత్‌శాఖ యూనిట్ ఛార్జీలను పెంచడం.. తాజాగా ఏసీడీ పేరిట మరోసారి అదనంగా వసూలు చేసే ప్రక్రియను తెరలేపడంతో జనం తట్టుకోలేకపోయారు. వీటిని చెల్లించేది లేదని ఖరాఖండిగా చెప్పారు. విద్యుత్‌శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జనాలు స్వచ్ఛందంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట నిరసనలు తెలుపడంతో విద్యుత్‌శాఖ వెనక్కి తగ్గింది.

పేద, మధ్య తరగతికి ఉపశమనం..!

ప్రభుత్వం ఏసీడీ ఛార్జీలు విధించడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కరోనా సంక్షోభం తర్వాత అనేక మంది జీవితాలు తారుమారయ్యాయి. చిరుద్యోగులు, చిరువ్యాపారులు, ఇతరాత్ర ప్రయివేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ప్రజలు ఆర్థికంగా చితికిపోయారు. ఈ తరుణంలో వచ్చే అరకొర వేతనంతో ఇంటిని పోషించడమే కష్టంగా మారగా.. విద్యుత్‌ఛార్జీలు నెలవారీ బిల్లులతో పాటు ఏసీడీ ఛార్జీలు అధికంగా రావడంతో కంగుతిన్నారు. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 40వేల కనెక్షన్లు ఉండగా.. జనవరి నెలలో ఈ ఏసీడీ ఛార్జీల రూపంలో అధికారులు రూ.51.39లక్షలు వసూలు చేశారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు ఈ బిల్లులు రావడంతో కరెంటు తొలగిస్తారనే భయంతో కొంత మంది చెల్లించగా.. అనేక మంది వీటిని చెల్లించేందుకు ముందుకు రాలేకపోయారు. ఆగ్రహం చెందిన జనం ఈ ఛార్జీలపై విద్యుత్ అధికారులను నిలదీశారు.

ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఛార్జీల వడ్డనపై నిరసనలు వ్యక్తం కావడంతో ప్రభుత్వం వీటిని వెనక్కి తీసుకుంటేనే బాగుంటుందని భావించింది. ఇది వరకు ఈ ఛార్జీలు చెల్లించిన వారికి కూడా తిరిగి వెనక్కి ఇచ్చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రద్దుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇది వరకే చెల్లించిన వారి విషయంలోనూ ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉందని పేర్కొంటున్నారు.

రైతులు అనుబంధ రంగాలల్లో నైపుణ్యం పెంచుకోవాలి

- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజేశ్వర్ నాయక్



నవతెలంగాణ-భీమారం

రైతు అనునిత్యం వ్యసాయ సాగులో నిమజ్ఞమౌతున్నప్పటికీ వ్యసాయ అనుబంధ రంగాలపై నైపుణ్యతను పెంపొందించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్ నాయక్ సూచించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉన్నతి నైపుణ్య శిక్షణ కార్యమంలో పాల్గొని వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం శారీరక శ్రమకు మాత్రమే అంకితమై ఉండకుండా వివిధ రంగాలలో నైపుణ్యాలను పెంపొందించుకుంటు జీవన ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ఇందుకుగాను వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉన్నటువంటి అవకాశాలు తేనెటీగల పెంపకం, పౌల్ట్రీ పరిశ్రమ, డైరీ కేద్రం, పుట్టగొడుగుల పెంపకం, వర్మీ కంపోస్ట్, మాంసాహార వంటి ఉత్పతులపై అవగాహన కల్పించారు. దీంతో రైతు సంఘాల ఏర్పడి సంఘటితంగా పనిచేయడం వల్ల అభివృద్ధిని సాధించవచ్చని తెలిపారు. అందుకు ప్రభుత్వ అందిస్తున్న అనుబంధ సహాయ సహకారాలు, వాతావరణ విభాగం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను అందిపుచ్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ శివకృష్ణ కోట, ఎంపీడీఓ కె.శ్రీనివాస్, జేడీఎం రామచందర్, ఏపీఓ ఎస్తర్ డేవిడ్, ఈసీ జేఆర్‌పీ రమాదేవి, టీఏలు, ఫీల్డ్ అస్టెంట్‌లు పాల్గొన్నారు.

అధికారినిపై దుర్భాషలాడిన నాయకునిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖలో పర్యవేక్షకురాలిగా విధులు నిర్వహిస్తున్న రెంటల సమతపై ఫోన్ చేసి దుర్భాషలాడిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ఈఓ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో ఉద్యోగులతో కలిసి నలబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా అధికారినిపై అధికార పార్టీ నాయకుడు ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం దారుణం అన్నారు. ఇది విధులకు ఆటంకం కలిగించడమేనని తెలిపారు. అధికార పార్టీ నాయకుడి ప్రవర్తనతో మనస్థాపానికి గురై ఆత్మహత్య ప్రయత్నం చేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మండల అధ్యక్షునిపై చర్యలు తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్చకులు నరేష్ శర్మ వారణాసి శ్రీనివాస్, శ్రీధర్, మురళీధర్, అనంత్, విజయ్ కుమార్, అభయ్ కుమార్, ఆచార్య, శివరాం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

జేఈఈ ప్రాథమిక పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జేఈఈ ప్రాథమిక పరీక్షలో జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలుర కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన విగ్నేష్ 78శాతం, మనోహర్ 53శాతం, విష్ణువర్ధన్ 51శాతం మార్కులు సాధించారని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన గురుకుల బాలుర విభాగంలో విగ్నేష్ ప్రథమ స్థానం సాధించారని అన్నారు. ప్రథమ స్థానం సాధించడానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుజాత, వార్డెన్ చారి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, శాలిని, ఆనందరావు, సచిన్, మాన్యు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయకుంటే ఆందోళన

- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పట్టణంలోని రోడ్లపై గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు, అధికారులు స్పందించి బాగుచేయకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై ఉన్న దుమ్ము ధూళితో పాటు సిర్పూర్ పేపర్ మిల్లు నుండి వెలువడే వాయువులతో వాతావరణ కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పాలకులు, అధికారులకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. రోడ్లు బాగు చేయాలని అధికారులకు, పాలకులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీఎం విషపూరిత వాయువులు, రోడ్లపై దుమ్ము దూళి నుండి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. పాలకులు, అధికారులు చర్యలు చేపట్టకుంటే ప్రజలందరిలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఉర్దూ బోర్డు ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఉర్దూ సైన్ బోర్డు ఏర్పాటు చేయడం పట్ల ఎంఐఎం పార్టీ పట్టణాధ్యక్షుడు అబ్దుల్ మొబీన్, కార్యదర్శి జావిద్‌లు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ పరిశీలనకు వచ్చిన జీఎంకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఉర్దూ సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేయడం జరుగిందని, తమ వినతికి స్పందించి బోర్డు ఏర్పాటు చేసిన రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

దళారుల నుంచి రైతులను కాపాడాలి

నవతెలంగాణ-కాసిపేట



దళారుల నుంచి పత్తి రైతులను కాపాడాలని, క్వింటాలు పత్తికి రూ.12,000 లు ధర చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం(ఏఐకేఎస్), సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పత్తి రైతులను కలిసి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని, ఇండ్లల్లో ఉన్న పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంట పండిస్తే నేడు ధర లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళారుల ఆటలు కట్టడిచేసి రైతులను అదుకోవల్సిందిపోయి చేతులెత్తేసి చోద్యం చూస్తున్నారన్నారు. దీనివలన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రైతు ప్రభుత్వాలని చెప్పుకుంటున్న రెండు ప్రభుత్వాలు రైతులు గోడును పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు సమస్యలపై ఫిబ్రవరి 10న ఛలో మంచిర్యాల కలెక్టరేట్ ముందు ధర్నా చెయ్యడం జరుగుతుందని, పత్తి రైతులు తమ బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి మంచిర్యాల తరలిరావాలని పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం), రైతు సంఘం నాయకులు, దుర్గం బాపు, రాజు, దుర్గం లస్మయ్య, రత్నం రమేష్, రత్నం సుధాకర్, సల్లురి సమిల్‌కుమార్, సల్లురీ రాజ్‌కుమార్, దుర్గం రవి, బిజ్జురి మల్లేష్, గద్దల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అధైర్య పడవద్దు ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం'



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇల్లు కాలి నష్టపోయిన ఆదివాసి కుటుంబాలకు అండగా ఉంటామని అధైర్య పడకూడదని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి హామీ ఇచ్చారు. తిర్యాని మండలంలోని పంగిడిమాదర గ్రామపంచాయతీ పరదిలోని సల్పలగూడ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఆరు ఇండ్లు పూర్తిగా దగ్ధం కావటంతో బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధైర్య పడవద్దని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని అన్నారు. ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని, అధైర్య పడవద్దని, అన్నివిధాల అండగా ఉంటామని భరోసాకల్పించారు. కన్నీటి పర్యంతమైన కుటుంబాలను ఓదార్చారు. మండల రేవిన్యూ సిబ్బంది, తహస్దిర్, అర్‌ఐలను పిలిపించి తక్షణం సహాయం భాధితకుటుంబలకు రెండ రోజుల్లో అందేంచేందుకు కృషిచేయాలని ఆదేశించారు. అనంతరం తన వంతుగా భాధిత కుటుంబాలకు దుప్పట్లు, బట్టలు, వంట సామగ్రి పాత్రలు, ప్రతి ఒక్క కుటుంబనికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కనక యాదవ రావ్, ఎంపీపీ శ్రీదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదేశ్, సర్పంచుల సంఘాం జిల్లా అధ్యక్షులు గుణవంతరావు, ఎంపీటీసీ కేశవరావు, సర్పంచ్ పర్చకి జంగు, నాయకులు భగవంతరావ్, రవీందర్, విశాల్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. బుధవారం నస్పూర్ మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న సమీకత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి. గౌతమి, రహదారులు-భవనాల శాఖ ఈఈ రాముతో కలిసి సందర్శించారు. కలెక్టర్ చాంబర్, వివిధ శాఖల గదులు, కారిడార్, కార్యాలయ ఆవరణ, నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలను ఒకే చోట లభించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా ప్రధాన కార్యాలయాలను కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం అవడంతో పాటు వేగంగా అందుతాయని తెలిపారు. భవన సముదాయంలో ప్రతి శాఖకు గదులను కేటాయించడం జరిగిందని, వివిధ రకాల సేవలకు కార్యాలయానికి వచ్చే ప్రజల కొరకు అవసరమైన త్రాగునీరు, కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఆహ్లాదకరమైన వాతావరణం కార్యాలయ ఆవరణలో మొక్కలు పెంచడం జరుగుతుందని తెలిపారు. భవన సముదాయ నిర్మాణంలో విద్యుత్ సరఫరా, ఇతర అంతర్గత పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

తహసీల్దార్‌తో దుర్భాషలాడిన వ్యకిపై కేసు

నవతెలంగాణ-కౌటాల

తహసీల్దార్‌తో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని తాటినగర్ గ్రామానికి చెందిన దుర్గం శరత్‌చంద్ర, తహసీల్దార్ మునావర్ షెరీఫ్‌ను దుర్భాషలాడుతూ విదులకు ఆటంకం కల్పించినట్లు ఫిర్యాదు రావటంతో ఆయనపై కేసు నమోదు చేశారు. నిందితుడు శరత్‌చంద్ర అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తనకు చెందిన తాటినగర్ గ్రామంలో గల 15 గుంటల భూమిని ఇతరులు సాగుచేసుకుంటున్నారని, ఆ భూమి నాకు ఇప్పించాలని తహసీల్దార్‌తో గొడవకు దిగాడు. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని, ఇందులో ఇతరుల నివాసగృహాలు ఏర్పరుచుకొని మిగతా భూమి సాగుచేసుకుంటున్నట్లు, ఈ విషయం కలెక్టర్‌కు తెలియజేయడం జరిగిందని, శరత్‌చంద్రకు ఈ భూమిపై ఎలాంటి హక్కులు లేవని, భూమి ఇప్పించడం కుదరదని తహసీల్దార్ తెలిపారు. దీంతో శరత్‌చంద్ర తహసీల్దార్‌పై దురుసుగా మాట్లాడుతూ తన విధులకు ఆటంకం కలిగించి తన పరువు పోయేలా ప్రచారం చేసినందుకు తహసీల్దార్ ఫిర్యాదు మేరకు శరత్‌చంద్రపై పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడిని నివారించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వేసవికాలంలో మండలంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలను గుర్తించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. గుండి ఉన్నత పాఠశాల నుండి బూరుగుడ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుని డిప్యూటేషన్‌పై పంపించడంపై మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లేష్ మండల విద్యాధికారి మనుకుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా పాలు, గుడ్లు సరఫరా కావడం లేదని, ఈదులవాడ అంగన్‌వాడీ కేంద్రం సరైన సమయానికి తెరవడం లేదని ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు భీమేష్, బాబురావు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ శశికళ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లేష్ కోఆప్షన్ సభ్యుడు అమానుల్లాఫర్వీజ్ పాల్గొన్నారు.

తోటి కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-దండేపల్లి

ఆదివాసి తోటి కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆదివాసి తోటి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఆత్రం రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివాసి తోటి కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి కులస్తుల జిల్లా సంఘం కాల పరిమితి ముగియటంతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 12న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ ఉంటుందని కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన కుల పెద్దలు పటేళ్లు మేధావులు ఉద్యోగులు హాజరై కమిటీ ఎన్నికకు సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రభుత్వం అనేక రకాల ఉద్యోగ ప్రకటనలు చేస్తుందని నిరుద్యోగులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో తోటి సంఘం నాయకులు మరుసుకుల గోపాల్, కుడిమేత తిరుపతి, కురిసింగ శంకర్, వల్క చిలుకయ్య ఆత్రం వెంకటరాజం, మరుసుకుల సరస్వతి, ఆత్రం రాజయ్య, కోడప ప్రభాకర్ పాల్గొన్నారు.



బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం చేయాలి

- బీజేపీ నియోజకవర్గ నాయకులు పాల్వాయి హరీష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలో భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు పాల్వాయి హరీష్ అన్నారు. బుధవారం ప్రజా కార్యాలయంలో బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిర్పూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 25 వరకు పట్టణంలోని శక్తి కేంద్రాల పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ స్థానికంగా బలోపేతం చేయడానికి శక్తి కేంద్రాల సమావేశాలు దోహదం చేస్తాయన్నారు. స్థానిక సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఈర్ల విశ్వేశ్వరరావు, కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, దెబ్బటి శ్రీనివాస్, చేరాల శ్రీనివాస్, రాజేందర్ జంజోడ్, సంతోష్ కుమార్ ఠాకూర్, అనిల్, చిప్ప రమేష్, మౌనిక, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

మూత్రశాలలు నిర్మించాలి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో మూత్ర శాలలు, మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని బుధవారం బీజేపీ మండల అధ్యక్షులు దత్త నిక్కం ఆధ్వర్యంలో ఎంపీడీఓ భగత్ రవీందర్, ఎంపీఓ సమీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు దత్త నిక్కం మాట్లాడుతూ మండల కేంద్రం వ్యాపారం పరంగా విస్తరించి ఉడటంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల మహారాష్ట్ర నుండి వచ్చే ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు కూడా ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని అన్నారు. బుధవారం జరిగే వార సంతలో సైతం ఇదే ఇబ్బంది ఉందని, వార సంతకు మహారాష్ట్ర నుండి వచ్చే మహిళ, వ్యాపారులు సైతం మూత్రశాలలు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని త్వరలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్ ఠాక్రె, ఖోడే ప్రదీప్, రాము భర్కడే, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో నిర్మిస్తున్న నర్సరీ పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్, జామడ, సోనాపూర్, ఖైర్‌డాట్వా, సుంగాపూర్, చోర్‌గావ్, గ్రామాలకు సంబంధించిన నర్సరీలో నింపిన మట్టిబ్యాగ్ నాటిన మొక్కలను పరిశీలించారు. ఎండకు మొక్కలు ఎండిపోకుండా రోజు క్రమం తప్పకుండా నీరు పోయాలని, నర్సరీ నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో టీఏ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పల్లె ప్రగతి పనులపై సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్మించిన నర్సరీ, బృహత్ పల్లె ప్రకృతి వనం, క్రీడా, ఉపాధి హామీ పనులు, లేబర్ డిమాండ్, తదితర అంశాలపై వివరాలు సేకరించారు. సమావేశంలో ఎంపీఓ స్వప్న శీలా, ఏపీఓ సురేందర్ ఉన్నారు.

ఆదిలాబాద్ డీపీఆర్ఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా పౌర సంబంధాల సమాచార శాఖాధికారి (డీపీఆర్ఓ) భీమ్‌కుమార్‌పై జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఛాంబర్‌లో కలిసిన జర్నలిస్టులు డీపీఆర్ఓ వైఖరిని వివరించారు. తరచూ తమ విధులకు ఆటంకం కలిగించే విధంగా డీపీఆర్ఓ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శనకు కలెక్టర్ వచ్చిన సమయంలో కవరేజ్ కోసం రావాలని డీపీఆర్ఓ గ్రూపులో సమాచారం అందించడంతోనే వీడియో, ఫోటో జర్నలిస్టులు అక్కడికి చేరుకున్నారని తెలిపారు. ఓ పత్రికకు చెందిన ఫోటో జర్నలిస్టు ఫోటోలు తీస్తున్న క్రమంలో డీపీఆర్ఓ కెమెరాను లాక్కోవడమే కాకుండా దురుసుగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఇది వరకు కూడా పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని జర్నలిస్టులు వివరించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలిస్తామని హామీనిచ్చినట్లు జర్నలిస్టులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వివిధ సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు ఉన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని షీటీం సభ్యులు వాణిశ్రీ, భగ్యశ్రీ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యా బుద్ధులు నేర్చుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ర్యాగింగ్‌లకు పాల్పడవద్దని సూచించారు. బాలిక విద్యార్థులను, బాలురు వేధిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పావని కుమారి, అధ్యాపకులు కేశవులు, మంజుల, శ్రీనివాసరావు, శ్రీలత, గణేష్, వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నివీరులను సన్మానించిన కళాశాల సిబ్బంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో చదువుతూ, అగ్ని వీరులుగా ఎంపికైన విద్యార్థులను బుధవారం కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కెప్టెన్ జగ్‌రాం అంతర్వేది వారికి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశ సేవ చేసే అవకాశం రావడం విద్యార్థుల అదృష్టమని అన్నారు. మిగతా విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి, ఎన్‌సీసీలో కష్టపడి అగ్ని వీరులుగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా అగ్ని వీరులకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్, రఘునాథ్, ప్రతాప్ సింగ్, రడావు సంతోష్ కుమార్, కే రమేష్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ నర్సింగరావు, తిరుపతి, శ్రీనివాస్, అనిత, అష్రఫ్ అలీ, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

శరీరంలో వచ్చే వాపులను నిర్లక్ష్యం చేయొద్దు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

శరీరంలో వచ్చే వాపులను నిర్లక్ష్యం చేయడం, కాళ్లలో నరాల వాపును నిర్లక్ష్యం చేసిన బోదకాలు వ్యాధి బారిన పడతారని పీహెచ్‌సీ డాక్టర్ భీం రావ్ అన్నారు. బుధవారం మండలంలోని పిప్రి పీహెచ్‌సీ ఉపకేంద్రంలో ఫైలేరియా వారోత్సవంలో భాగంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు కోసం స్థానిక సర్పంచ్ కవితతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ భీంరావ్ మాట్లాడుతూ బోదకాలు వ్యాధి క్యూలెక్స్ దోమ కాటు వల్ల వ్యాపిస్తుందని, ఫైలేరియా వ్యాధి చికిత్స కంటే నివారణ మేలని స్పష్టం చేశారు. బోధకాలు బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. అంతే కాకుండా శుక్రవారం సాయంత్రం శిబిరంలో భాగంగా రక్త నమూనాలను సేకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సూర్యప్రకాష్, సూపర్‌వైజర్ దేవిదాస్, ఏఎన్ఎం సంగీత, ఆశ కార్యకర్త గంగామణి పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-కడెం

మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఐటీయూ అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచిందని అన్నారు. ప్రభుత్వం 4న జీఓను విడుదల చేయడాన్ని హర్షిస్తూ ఎంఈఓ కార్యాలయంలో కార్మికులు ఆనందంతో మిఠాయిలు పంచుకున్నారు. అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో అప్పులు తెచ్చి వంటలు చేసి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల పోరాటాల ఫలితంగా గత సంవత్సరం అసెంబ్లీలో సీఎం ప్రకటించి అమలు చేయలేదని అన్నారు. గత సంవత్సరం నుంచి జీఓ విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ చేసిన పోరాటాల ఫలితంగా శనివారం జీఓ విడుదల చేసిందని అన్నారు. జీఓ విడుదల చేయడాన్నీ సీఐటీయూ హర్షిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ జీఓను గత సంవత్సరం అసెంబ్లీలో ప్రకటించిన నాటి నుండి అమలు చేస్తూ, ఏరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. వేతనాల పెంపు జీఓ కోసం పోరాటాలు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల అభినందన సభ నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఈ నెల 12న విజయోత్సవాలు జరపాలని జిల్లా కమిటీ నిర్ణయించిందని అన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధ, మండల అధ్యక్షులు లత, దస్తురాబాద్ మండల అధ్యక్షులు వెంకవ్వ, కార్యదర్శి, సత్యవ్వ, మల్లక్క, గంగవ్వ విజయ, కలవ్వ, లక్ష్మీ పాల్గొన్నారు.

సమ్మె విరమించిన రిమ్స్ స్టాఫ్ నర్సులు

- డైరెక్టర్‌తో చర్చలు సఫలం
- 12 రోజుల పోరాటం హర్షం వ్యక్తం చేసిన నర్సులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్స్‌ల గత ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మె ఎట్టకేలకు విరమించారు. కాగా బుధవారంతో 12వ రోజుకు చేరుకోగా యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులతో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ చర్చలు జరిపారు. ఈ చర్చలలో కంటిన్యూయేషన్ ఆర్డర్ వచ్చిందని డైరెక్టర్ తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల వేతనాలలో ఐదు నెలల వేతనాలకై జిల్లా ట్రెజరీకి బిల్స్ పంపినట్లు తెలిపారు. కాగా మిగతా మూడు నెలల వేతనాల కోసం బడ్జెట్ కావాలని, రాష్ట్ర అధికారులకు నివేదిక పంపామని అన్నారు. సమ్మె శిబిరానికి రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ వచ్చి స్టాఫ్ నర్సులకు నిమ్మ రసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు. గత 12 రోజులుగా స్టాఫ్ నర్సులు తమ విధులను బహిష్కరించి వివిధ రకాల కార్యక్రమాలతో నిరసన తెలిపారు. అధికారులు స్పందించి వేతనాలు చెల్లించడంతో నర్సులు సంతోషం వ్యక్తం చేశారు. గత 12 రోజుల నుండి నిరసన తెలుపగా తమకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ముఖ్యంగా సీఐటీయూ నాయకులకు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీదర్, స్టాఫ్ నర్సులు రాజ్యలక్ష్మీ వనజ, చంద్రకళ, పుష్పలత, వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.

కరెంటు కోతలకు నిరసనగా రైతుల రాస్తారోకో

- విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేసిన రైతులు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

తెలంగాణ ఏర్పడితే తమకు కరెంటు కష్టాలు తీరతాయని అనుకుంటే తెలంగాణ ప్రభుత్వం ఇష్టారీతిన కరెంటు కోతలు విధిస్తూ, ఇష్టారీతిన కరెంటు చార్జీలు పెంచుతుందని బుధవారం నర్సాపూర్(జి) మండలం రాంపూర్ రైతులు రోడ్డెక్కారు. రైతుల రాస్తారోకో నిరసనలకు నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దొడ్డికింది ముత్యం రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక పంట పొలాలకు ఇరువై నాలుగు గంటలతో పాటు విద్యుత్ సరఫరా చేస్తామని వాగ్దానాలు చేసిన ప్రభుత్వం హద్దు అదుపు లేకుండా కరెంటు కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి విధించే కరెంటు బిల్లులు ఇష్టరీతిన సర్ చార్జీలు విధిస్తూ, ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తేరుకుని వ్యవసాయానికి తగిన రీతిలో విద్యుత్ ఉత్పత్తి చేయాలని, సర్‌చార్జీల పేరుతో అధిక విద్యుత్ బిల్లులు ఆపివేయాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్సై పాకాల గీత ధర్నా స్థలానికి చేరుకుని నిరసనకారులను చెదరగొట్టారు. అనంతరం నాయకులు విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్ గోవింద్ రెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ వీరేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహచర ఉద్యోగికి మిత్రుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-జైనథ్

ప్రమాదవశాత్తు ఇటీవల జాతీయ రహదారిపైన ఎడ్ల బండిని ఢీకొని రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్న పెండల్‌వాడ గ్రామానికి చెందిన ఆగ్రో ఉద్యోగి ఆశన్న కుటుంబ సభ్యులకు మేము ఉన్నామని భరోసాను ఇస్తూ, ఆగ్రో డీలర్లు, వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న సహచర ఉద్యోగులు తమ స్థోమతకు తగ్గట్టు వివిధ మాధ్యమాల ద్వారా దాదాపు రూ.6లక్షల 95వేలను జమ చేసి బుధవారం మృతుడి భార్య, కూతురికి ఆగ్రో డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు విలాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి భగత్ రమేష్ చేతుల మీదుగా, ఆగ్రో ఉద్యోగులు, డీలర్ల సమక్షంలో వారి పిల్లల ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా ఉండాలనే ఉద్దేశంతో వారికి అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆగ్రో ఉద్యోగుల సంఘం ప్రతినిధి గంద్రత్ సంతోష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 8 మంది సహచర ఉద్యోగులు వివిధ ప్రమాదాల్లో మరణించిచడం జరిగిందని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ఇదే విధంగా అందరూ కలిసి ఇవ్వడం జరిగిందని అన్నారు. మేము చేస్తున్నా ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరి నుండి సంపూర్ణ సహాయ, సహకారాన్ని అందిస్తున్నారని, ఇంకా చాలా మంది మానవతా వాదులు, దాతలు ముందుకు వస్తున్నారని అన్నారు. సహచర ఉద్యోగి ఆకస్మికంగా చనిపోవడం ప్రతి ఒక్కరిని కలిచి వేసిందని, కన్నీటి పర్యంతం అయ్యారు. ఒక్క రూపాయి కూడా తేడా లేకుండా బాధితులకు అందించుటలో అన్ని కంపెనీల్లో పనిచేస్తున్న సహచర మిత్రులు అందరూ ఎవరికి వారు సమాచారాన్ని చేరవేసి, ఒక దగ్గర డబ్బులను చేర్చి, అందించుటలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయడం వలనే, ఈ రోజు ఇంత మొత్తం అయ్యిందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా పరస్పర గౌరవం, సంతృప్తి ఉంటుందని అన్నారు. వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ ఆగ్రో ఉద్యోగుల కృషి అభినందనీయమని, అందరూ కూడా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆగ్రో డీలర్స్ ప్రతినిధులు తాటిపెళ్లి శివప్రసాద్, ఆగ్రో ఉద్యోగులు యాకూబ్, రవికాంత్, ముక్తర్, విలాస్, గజనాన్, సతీష్ రెడ్డి, కశ్యప్ రెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమ అధికారుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతిగృహ సంక్షేమ అధికారుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్‌లు కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంక్షేమ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించి పరిష్కరించేలా చూడాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింలు, అమిత్, రాష్ట్ర నాయకులు విఠల్, సుజాత, ఓంప్రసాద్, జయమ్మ, రాధ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకస్మికంగా వృద్ధుడి మృతి

నవతెలంగాణ-జైనథ్

మందుల కోసం వెళ్లిన వృద్ధుడు అంతలోనే ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ గ్రామానికి చెందిన మ్యాన నాగన్న(75) బుధవారం షుగర్ మందుల కోసం పీహెచ్‌సీకి వెళ్లాడు అక్కడికి వెళ్లిన వృద్ధుడు షుగర్ పరీక్ష చేయించుకునేందుకు ల్యాబ్ దగ్గరకు వెళ్లాడు. అక్కడే కింద పడిపోయాడు వెంటనే సిబ్బంది ఆయనను పరీక్షించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు 108లో తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు పేర్కొన్నారు.

సబ్ స్టేషన్ ముందు రైతుల ధర్నా

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పుస్పూర్ గ్రామంలో కరెంట్ కోతలకు నిరసనగా రైతులు సబ్ స్టేషన్ ముందు బుధవారం నిరసన వ్యక్తం చేసి ధర్నా చేపట్టారు. పంటలు సాగు చేస్తున్న రైతులు కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక వైపు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నా, వ్యవసాయ పొలాల వద్ద ఆ సరఫరా లేదని, కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రోజు మొత్తం కరెంట్ కోసం ఎదురు చూడక తప్పడం లేదని వాపోయారు. 24 గంటలు నిరంతరాయంగా కరెంట్ అందజేయాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీని సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని అర్బన్ కేజీబీవీని డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న సేవలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలను పరిశీలించి, సరుకుల నాణ్యత, భోజనం రుచి, తదితర వాటిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ దీప్తి సిబ్బంది ఉన్నారు.

కళా వృత్తులు కాపాడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కనుమరుగవుతున్న కళా వృత్తులను కాపాడాలని తొడసం మారుతీ అన్నారు. మండలంలోని చిట్యాలబోరి గ్రామంలో బుధవారం కళావృత్తులు కనుమరుగైనట్లు కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత ముత్తాతల నుండి గోండు కులస్తులను, కొత్త పంటలు పండగానే ఇండ్లలోకి వచ్చియాంటే కిక్కిరి వాయిస్తూ తోగల్లు, జొన్నలు, బియ్యం, మహిళలు చాటతో వృద్ధ కళాకారునికి దానధర్మం చేస్తుంటారు. ఆడుక్కుంటూ ఆనవాయితీగా వస్తుందని మారుతి తెలిపారు. కొంతమంది రూ.10, 20, 30 ఇస్తారని అన్నారు. ఈ విధంగా ఊర్లోనే ప్రతి ఇంటిలో కిక్కిరి వాయిస్తూ పాట పాడుకుంటూ అడుగడం జరుగుతుందని అన్నారు. కనుమరుగవుతున్న కళారూపాలను భవిష్యత్ తరాలకు వివిధ సంస్కృతి సాంప్రదాయాలను ఇలాంటి కళాకారుల ద్వారా ప్రజలను చైతన్యపరిచే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముగిసిన బడిబాట విద్యార్థుల సర్వే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లాలో 6 నుండి 19 సంవత్సరాల బడి బయట పిల్లల సర్వే బుధవారంతో ముగిసింది. ఈ సర్వేలో 259 మంది విద్యార్థులను గుర్తించడం జరిగిందని సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య తెలిపారు. విద్యహక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలోనే ఉండాలని, వారికి నిర్బంధ ఉచిత విద్యను అందించాలని, పాఠ్యపుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం ఇవ్వాలని ఉందని అందుకు అనుగుణంగానే గుర్తించిన విద్యార్థులందరినీ రెగ్యులర్ విద్యను అందించడం జరుగుతుందని అన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 09 ఫిబ్రవరి 2023

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి

నవతెలంగాణ-తాండూర్



పంచాయతీలలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఫణిదర్ రావు సూచించారు. బుధవారం మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీని ఆయన ఆకస్మికంగా సందర్శించి పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళికి పలు సూచనలు చేశారు. పంచాయతీల పనితీరు పర్యవేక్షణలో భాగంగా కిష్టంపేట గ్రామంలో పలు వీధులు సందర్శించి గ్రామపంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయితీలలోని వీధుల్లో క్రమం తప్పకుండా తడి పొడి చెత్తను సేకరించి నాలాలను శుభ్రపరచాలని చెప్పారు. గ్రామపంచాయతీ నర్సరీల నిర్వహణను సక్రమమైన పద్ధతిలో చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతి పలు రికార్డులు తనిఖీ చేశారు. ఆరోగ్య మిత్ర కేవైసీ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించినారు.

ఐదు పిల్లలకు జన్మనిచ్చిన మేక

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని వెంకట్రావు పేట్ గ్రామానికి చెందిన కొండగురుగుల రాజన్న అనే వ్యక్తికి చెందిన మేక బుధవారం 5 మేక పిల్లలకు జన్మనిచ్చింది. ఒకే కాన్పు లో 5 మేక పిల్లలు పుట్టడంతో యజమాని ఆనందానికి అవధులు లేవు. ఈ లాంటి అధిక సంతానోత్పత్తి కలిగిన మేకను కలిగి ఉండటం అదృష్టంగా భావిస్తున్నట్లు యజమాని తెలిపారు. ఈ మేకకు సంబంధించిన ప్రత్యేక పోషణ, తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఇటువంటి అరుదైన జాతి మేకలను పాడి రైతులు అందించి ప్రోత్సహించాలని కోరారు.

వాహనం పైనుంచి పడి గర్భిణీకి గాయాలు

నవతెలంగాణ-జన్నారం



స్పీడ్ బ్రేకర్ వద్ద ఎలాటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతో ద్విచక్ర వాహనంపై వెల్తున్న గర్బిని బుధవారం కిందపడి గాయాలపాలైది. మండలంలోని చింతాగూడ, నుంచి, తపాలాపూర్ చెక్‌పోస్ట్ మధ్య ప్రధాన రహదారిపై అటవీ శాఖ అధికారులు ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా ఆర్ అండ్ బి అధికారులతో స్పీడ్ బ్రేకర్లు వేయించారు. అడవి ప్రాంతంలో అటుగా వెళుతున్న మేదర్ పేటకు చెందిన లక్ష్మి అనే గర్బిణి తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ద్విచక్ర వాహనం ఒకేసారి స్పీడ్ బ్రేకర్ ఎక్కి దిగడంతో, ఎనకన కూర్చున్న గర్బిణి కింద పడిపోయింది. ఆ మహిళకు తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె భర్త లక్ష్మిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వాహనంపై ముందు కూర్చున్న చిన్న బాబుకు కూడా చిన్నచిన్న గాయాలు అయ్యాయి. ఎలాంటి అనుమతులు లేకుండా అటవీశాఖ, ఆర్ అండ్ బి అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు తీస్తున్నారని, ప్రధాన రహదారిపై వచ్చి పోయే వాహనదారులు తీవ్ర ఆగ్రహానికి లోనవుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన స్థలంలో కనీసం సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

సంఘాన్ని బలోపేతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

మాదిగ హక్కుల దండోరా సంఘాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నస్పూర్ మున్సిపాలిటీలో మాది ఆకుల దండోరా కమిటీల పునర్నిర్మాణంలో భాగంగా మండల కన్వీనర్‌గా అట్కపురం సమ్మయ్య మాదిగను నియమించినట్లు నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. అలాగే 10వ తేదీన పూర్తిస్థాయి పట్టణ కమిటీ నియమిస్తామని తెలిపారు. పట్టణంలోని మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అన్ని వార్డుల్లో కమిటీలను నియమించి సంఘాన్ని బలోపేతం చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి రమేష్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి కోంద్ర ఉదయ్, అటుకపురం లక్ష్మణ్, లావణ్య మాదిగ, మారపాక వెంకటేష్, రాజేష్ మాదిగ, బాపు మాదిగ, సురేష్ మాదిగ, మహేష్, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ ఆదిలాబాద్ డాక్టర్ తుమ్మల మల్లారెడ్డి ఆధ్వర్యంలో విద్యా, నీతి, విలువలు అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం రాథోడ్ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాల్ తుమ్మల మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మంచి విలువలతో కూడిన గుణాత్మకమైన విద్యను అభ్యసించి ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని కోరారు. అనంతరం ఆయనకు పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాథోడ్ రమేష్, ఉపాధ్యాయులు డీ.పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణ గోపాల్ రావు, టీ.జ్యోతి, ఎం.అనసూర్య, ఏ.అర్చన పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

నవతెలంగాణ-తాండూర్

పోడు భూముల కేటాయింపు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగినట్టు బెజ్జాల ఎఫ్‌ఆర్‌సీ చైర్మన్ అమృత రావు తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామ పంచాయతీలో గిరిజనులు పోడు వ్యవసాయంపై జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఎఫ్‌ఆర్‌సీ కమిటీ ఆమోదం మేరకు అటవీ హక్కు పత్రాలను పరిశీలించి గ్రామ సభల ద్వారా 200 వందలపై చిలుకు రైతులను ఎంపిక చేశామని తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ మొత్తంలో 10 నుంచి 15 మంది అర్జీదారులను అర్హులుగా గుర్తించినట్లు ఎస్‌డీఎల్ కమిటి పంపించడంతో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. క్షేత స్థాయిలో పరిశీలించి నిజమైన లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయన కోరారు

'సీపీఐ నీచమైన రాజకీయాలు చేయదు'

- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్



నవతెలంగాణ-నస్పూర్

సీపీఐ నీచమైన రాజకీయాలు చేయదని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని, బూర్జువ పార్టీలు తమపై అసత్యపు ప్రచారాన్ని చేస్తున్నారని పేర్కొన్నారు. మతం పేరుతో విభజించి పాలన చేస్తున్నారన్నారు. బూర్జువ పార్టీలు ప్రజల సంక్షేమానికి కాకుండా స్వలాభం కోసం పనిచేస్తున్నాయన్నారు. పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.పది లక్షల రుణం ఇవ్వాలని అన్నారు. రానున్న రోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ బలాన్ని పెంచుకొని ప్రజలకు మరింత చేరువవుతామని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌ను అరెస్టు చేయాలని, అతని భార్య ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని బంధువులు పేర్కొన్నట్లు తెలిపారు. బహిరంగ పోస్టుమార్టం చేసి నిజ నిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి మల్లయ్య, నాయకులు రేగుంట చంద్రశేఖర్, మేకల దాసు, లింగం రవి పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగంపట్ల నిర్లక్ష్యం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి
- జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన



నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరొకసారి విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని భారత విద్యార్థి సంఘం(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో విద్యార్థులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సందర్భంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ మొత్తం బడ్జెట్ రూ. 2,90396 కోట్లలో కేవలం రూ.19093 కోట్ల కేటాయింపుతో 6.57 శాతానికి మాత్రమే పరిమితం చేయడం విద్యారంగం పట్ల ప్రభుత్వ వైఖరి అర్థమవుతుందని అన్నారు. పాఠశాల, విద్యాశాఖకు కేవలం రూ16092 కోట్లు 5.54 శాతం, ఉన్నత విద్యకు రూ.3001 కోట్లు ఒక శాతం కేటాయించారని మొత్తం బడ్జెట్ 2,90,396 కోట్లలో, కనీసం 10 శాతం నిధులు కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగం పట్ల ప్రభుత్వ చిత్త శుద్ధి ఏ రకంగా ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ఈ సారి ఉన్నత విద్యకు సంబంధించి రూ.3001 కోట్లు మాత్రమే కేటాయించి, రూ.500 కోట్లు విశ్వ విద్యాలయాలలోని మౌలిక వసతుల కల్పనకు కేటాయించారని, ఉన్నత విద్యలో కూడా నామమాత్రం కేటాయింపులేనని అన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు యూనివర్సిటీలో ఉన్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా సరిపోలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచలేదని వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమల్లోకి తెస్తామని చెప్పిన మన ఊరు-మనబడి పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వం గత బడ్జెట్‌లో కూడా ఆ పథకానికి ప్రత్యేక కేటాయింపులు చేయలేదని తెలిపారు. దానికి సంబంధించిన రెండవ దఫా కేటాయింపులనైన ఈసారి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం కేటాయించిన అరకొర నిధులతో విద్యారంగం మరింత బలహీనపడుతుందని విద్యారంగానికి కేటాయించినటువంటి బడ్జెట్ పైన పున: సమీక్ష చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మండల కార్యదర్శి ఈదునూరి అభినవ్, కొప్పుల శ్రావణ్ పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ కార్మిక కార్మిక సంక్షేమ మండలి పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అంధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం బిల్డింగ్ అండ్ అధర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాజేశ్వాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు వెంటనే పాలక మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలక మండలి కాలపరిమితి ముగిసి ఏండ్లు గడుస్తున్నా నూతన పాలక మండలిని ఏర్పాటు చేయకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మిక ప్రతినిధులతో పాలకమండలిని ఏర్పాటు చేయాలని అన్నారు. 55 ఏండ్లు నుండిన కార్మికులకు రూ.ఐదువేల పింఛన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, పెళ్లి కానుకకు రూ.లక్ష, మెటర్నిటీ రూ.50,000 పెంచాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగంలో వాడే మెటీరియల్స్ ధరలను నియంత్రించాలన్నారు. కార్మికుల అడ్డాల వద్ద అన్ని వసతులతో షెడ్లు కట్టించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిర్యాని మండల అధ్యక్షులు బి.రవి, కార్యదర్శి సత్తయ్య, గోలేటి అధ్యక్షులు వడ్లూరి లింగయ్య, ప్రధానకార్యదర్శి సీహెచ్ భీమేష్, కోశాధికారి రఫిక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. మండలంలోని బురుగుడా, ఈదులవాడ గ్రామాలను ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాలలోని పలు వీధులలో నడుచుకుంటూ తిరుగుతూ గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రహదారులపై చెత్త, చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. మిషన్ భగీరథ నీరు లీకేజీ లేకుండా చూడాలన్నారు. ఈదులవాడా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్య, మధ్యాహ్న భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొమ్ముగూడా గ్రామ సమీపంలో జరుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పనిచేసే వారికి మాత్రమే హాజరు వేయాలని, పని చెయ్యని వారికి హాజరు వేయకూడదని ఉపాధిహామీ ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రసాద్, సెక్రెటరీలు శ్రీలత, జాహుర్, సర్పంచ్‌లు బూసి భీమేష్, చౌదరి మాధవి పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల సంబరాలు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో మధ్యాహ్నభోజన కార్మికులు బుధవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నభోజన కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ చేసిన అలుపెరుగని పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి నుండి రూ.మూడు వేలకు పెంచిందన్నారు. అనేక ఏండ్లుగా అతి తక్కువ వేతనాలతో అప్పులు తెచ్చి వంటలు చేసి పెడుతున్న మధ్యాహ్నభోజన కార్మికుల పోరాటాల ఫలితంగా గతేడాది అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించి అమలుచేయలేదన్నారు. జీఓ విడుదల చేయడాన్ని సీఐటీయూ స్వాగతిస్తోందని పేర్కొన్నారు. ఈ జీవోను గతేడాది మార్చి 15న శాసనసభలో ప్రకటించిన నాటి నుంచి అమలుచేసి ఏరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. వేతనాల పెంపు జీఓ కోసం పోరాటాలు చేసిన మధ్యాహ్నభోజన కార్మికుల అభినందన సభ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 6, 7, 8వ తేదీల్లో మండలకేంద్రాల్లో విజయోత్సవ సభలను జరపాలని నిర్ణయం తీసుకోగా ఈ రోజు రెబ్బెన మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు మధ్యాహ్నభోజన పథకం కార్మికులు టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ నెల 15వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు పాగిడి మాయ, విజయ, పద్మ, నిర్మళ, శాంత, పోచవ్వ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పనుల పరిశీలన

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయతీని ఎంపీఓ శ్రీపతి బాపురావు బుధవారం మొబైల్ ఆప్ ద్వారా పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను విస్తృతంగా చేపట్టి, డైలీ శానిటేషన్ రిపోర్ట్‌ను మొబైల్ ఆప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోజు ట్రాక్టర్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి చెత్తను వేరు చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై చెత్త, కర్రలు, బండలు లేకుండా చూడాలని, హరిత హారం మొక్కలు వంద శాతం సంరక్షించాలని సూచించారు. వాటర్ ట్యాంక్ లను క్లీనింగ్ చేసి రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని గ్రామ పంచాయతీ ద్వారా జారీ చేయబడి ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రెండు నెలలకొకసారి గ్రామ సభ, ప్రతి నెలకు ఒక సారి పంచాయతి మీటింగ్ నిర్వహించాలన్నారు. గ్రామ సభలకు, మీటింగ్‌లకు స్టాండింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్యతో కలిసి పరిశీలించారు. వారి వెంట సర్పంచ్ తాటిపాముల రాజేశ్వరి, కార్యదర్శి యూసుఫ్ ఉన్నారు.

నల్ల బ్యాడ్జీలతో మున్సిపల్ కార్మికుల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

నాలుగు నెలల పాటూ వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం కాగజ్‌నగర్ మునిసిపల్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్ కుమార్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ లేకపోవడంతో ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్తే కనీసం మందులు కూడా ఇవ్వడంలేదన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పిల్లల ఫీజులు కట్టుకోలేకపోతున్నారని, కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సోమవారం వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతామని, సమస్యపరిష్కరించనట్లయితే తమ ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

మాల కులస్తులు ఐక్యమత్యంతో ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

మాల కులస్తులు ఐక్యమత్యంతో ఉండాలని మాల మహానాడు నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో మాల మహానాడు మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. మాల కులస్తులు ఐక్యమత్యంతో అభివృద్ధి బాటలో పయనించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు జక్కుల సురేష్, డి.కర్ణాకర్, బి.సంజీవ్, ఏ.దేవయ్య, పి.బాలరాజ్, డా.బెంజిమాన్, ఏ.పద్మారావు, కే.పద్మారావు, ఇషాక్, ఎం.వెంకటేష్, కే.గంగన్న పాల్గొన్నారు.

యాసంగి పత్తి పంటతో అధిక లాభాలు



నవతెలంగాణ-తాండూర్

యాసంగి పత్తి పంటతో అధిక లాభాలు ఉన్నాయని బెల్లంపల్లి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త తిరుపతితో కలిసి బుధవారం బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలోయాసంగి పత్తి సాగు చేస్తున్న 12 మంది రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వసతి కింద యాసంగి పత్తి సాగు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. యాసంగి పత్తి సాగు చేసే రైతులకు చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని తెలిపారు. రైతులు సరియైన పద్ధతిలో నీటి వసతి ఎరువుల యాజమాన్యం అంతర కృషి కలుపు యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే ఖరీఫ్ దిగుబడులతో సమానంగా రాబడులు పొందవచ్చునన్నారు. యాసంగి పత్తి సాగులో కూలీల కొరత అతివృష్టి అనావృష్టి నష్టాలు ఉండవన్నారు. ప్రస్తుతం పైరు కీలక దశలో ఉందని రైతులు సరియైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ప్రస్తుతం పంటలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆత్మ బీటీఎం సంధ్య పాల్గొన్నారు.

ప్రహారిగోడకు భూమిపూజ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామంలోగల ఎంపీపీఎస్ గొల్లగూడ పాఠశాలలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం సర్పంచ్ పెందూర్ పవన్ ప్రహారిగోడకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లలిత, కార్యదర్శి పోశం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూష, ఉపాధ్యాయుడు రాజు, వార్డుసభ్యులు మనోహర్, తిరుపతి, ఈశ్వరీబాయి, మాజీ ఎంపీటీసీ దేవినేని గొల్ల, కారోబార్ అశోక్ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు జీపీ కార్మికుల వినతి



నవతెలంగాణ-కౌటాల

జీపీ కార్మికులకు వేతనాలు రావడంలేదని ఎంపీడీఓ నస్రుల్లాఖాన్‌కు కార్మికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీడీఓ పేర్కొన్నారు. అనంతరం కార్మికుడు మోర్లె నాగేష్ మాట్లాడుతూ అరకొర వేతనాలతో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, గత ఐదు నెలలుగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కార్మికుల జీతాలు విడుదల చేయకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్మికులు శంకర్, మొరేశ్వర్, ప్రకాష్, మల్లయ్య పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల 20వ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంతో పాటు ముఖ్యఅతిథులుగా ఎంపీపీ మహిపాల్ రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ అయిటి చందు, ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు సుజాత హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, పాటలు, సంస్కృతిక కార్యక్రమాలు కీలకమని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, సుచరిత, రాజేశ్వర్ రావు, ఎంపీటీసీ పద్మ వీరయ్యలు, కరస్పాండెంట్ రమణరావులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుదేవ్ చెరువు కబ్జాకు యత్నం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఏమాయికుంట శివారులోని గురుదేవ్ సింగ్ చెరువుపై రియల్టర్ల కన్నుపడింది. గత 40 సంవత్సరాల క్రితం నిర్మించిన చెరువు ప్రస్తుతం మండలకేంద్రానికి అనుకొని వుంది. ఇక్కడ భూమికి లక్షల్లో డిమాండ్ ఉంది. దీంతో ఓ వ్యక్తి తన పేరిట పట్టా ఉందంటూ పోక్లెయిన్‌తో భూమిని చదును చేశారు. ఈ విషయం రెవెన్యూ, చిన్న నీటి పారుదల శాఖకు తెలియడంతో బుధవారం ఎస్సై డి.సునీల్, డీటీ రమేష్ నాయక్, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు వద్దకు వెళ్లి పనులను అడ్డగించారు. ఇది పూర్తిగా చెరువు భూసేకరణ కింద పోయిన భూమినే అంటు అధికారులు తేల్చి చెప్పారు. తన వద్ద పట్టా భూమి ఉందంటూ సదరు వ్యక్తి అధికారులకు తెలిపారు. భూపట్టా చూపించాలని అధికారులు వెల్లడించారు.

నిరంతర విద్యుత్‌ను అందించాలని ఆందోళన

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో కొనసాగుతున్న రైతుల ఆందోళనలు, బుధవారం వంజర్ గ్రామ రైతులు మలక్ చించొలిలోని 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. విద్యుత్ కోతలను ఆపి, పంటలను కాపాడాలని అక్కడే ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. మండలంలో ఈ యేడు యాసంగిలో రైతులు అధిక శాతం మొక్కజొన్న వేశారు రెండు మూడు సార్లు నీటి పారుకం అందిస్తే పంట చేతికందుతుంది. ఈ సమయంలో కరెంట్ కోతలు విధిస్తే పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నట్లు చెప్పుతున్నారు. ఆచారంలో చూపడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఉన్నత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి నిరంతర విద్యుత్ సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాలదత్తు, కలాల శ్రీనివాస్‌లను బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని బీసీ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం కులాల కతీతంగా, రాజకీయల కతీతంగా పనిచేయాలని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల బీసీ యువకులు ఉపాధిని కోల్పోతున్నారని అన్నారు. బీసీల హక్కులకోసం మనమంతా సమిష్టిగా రాజకీయాలకతీతంగా పోరాడుదామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలా మున్న, దినేష్ మాటోలియా, జోగురవి, రాజేష్, మహేందర్, కృష్ణ, శ్రీనివాస్, సురేందర్, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు పనుల ప్రారంభం

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల కేంద్రం నుండి బామ్ని(కె) గ్రామం వరకు గుంతలుపడి అస్తవ్యస్తంగా ఉన్న రహదారి మరమ్మత్తులకు రూ.1 కోటి 12 లక్షల నిధులు మంజూరయ్యాయి. రహదారి మరమ్మత్తు పనులను బుధవారం ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీచైర్మన్ లోలం శ్యాంసుందర్, మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. గుంతలు పడి అస్థవ్యస్తంగా ఉన్న రోడ్డు వల్ల మండల ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లను తీర్చేందుకు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి, మండల ప్రజల తరఫున మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్, పీఏసీఎస్ చైర్మెన్ రత్నకర్‌రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం రిమ్స్, సూపర్ స్పెషాలిటీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిమ్స్, సూపర్‌స్పెషాలిటీలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన అనుభవం కలిగిన వైద్య బృందం అందుబాటులో ఉందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని రోగులు రిమ్స్‌కు వైద్య చికిత్సల కోసం రావడం జరుగుతుందని అన్నారు. రిమ్స్ వచ్చే రోగులకు మంచి వైద్యం అందించాలని అన్నారు. ఇప్పటికే పలు రకాల వైద్య సేవలు అందిస్తున్నామని రానున్న కాలంలో సూపర్ స్పెషాలిటీలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించడానికి వైద్య బృందం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జిల్లా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అవసరమైన సౌకర్యాలు అందించడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. మారుమూల జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు వారి సేవలను అందించడం అదృష్టమని, ఈ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందిస్తూ జిల్లా ప్రజలను ఆరోగ్యాంగా ఉంచేందుకు తమ సహకారం ఉంటుందని అన్నారు. మోకాలు చిప్ప మార్పిడి చికిత్సలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు పలు విభాగాలకు సంబంధించిన వార్డులను, నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఆపరేషన్ థియేటర్‌లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిమ్స్‌లోని పలు విభాగాలను, ఐసీయూ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, డా.తిప్పా స్వామి, డా.ఇద్రీస్ అక్మని, ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ నియమాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-కడెం



అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో అటవీ సంరక్షణ నియమాలు-2022ను ఉపసంహరించుకోవాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు సర్దార్ డిమాండ్ చేశారు. బుధవారం కడెం మండలంలో ధర్నా చేసి అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం 2006 ఆమోదించి, 16 సంవత్సరాలు దాటిన దేశంలో ఇంతవరకు ఏ రాష్ట్రంలో కూడా సరిగా అమలు కాకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో గతంలోను, ఇప్పుడు కూడా చట్టం సరిగా అమలు జరగలేదని అన్నారు. అటవీ హక్కులను సమాజంలో అన్ని విధాలుగా వెనుకబడిన ఆదివాసులు, గిరిజనులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఇతర పేదలు, కొత్తగా హక్కులు గాని కోరడం లేదని చట్టంలో ఉన్న హక్కులను తప్ప ఆచరణకు అమలు కానీవి ఏమి కోరడం లేదని అన్నారు. కేంద్రం కార్పొరేట్లకు అనుకూలంగా తెస్తున్న నియమాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాటిలైట్ మాప్ పేరుతో మోసం చేస్తున్నారని, వెంటనే అటవీ సాగుభూములన్నింటికి పట్టాలు ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపి నర్సయ్య, సహాయ కార్యదర్శి మంచుకంటి లక్ష్మణ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు దుర్గం లింగన్న ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గొనె స్వామి, రేగుల గంగన్న, గుట్ల ప్రసాద్, గుజ్జుల గజ్జన్న పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ విద్య వ్యతిరేక విధానాలు నశించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర ప్రభుత్వ విద్య వ్యతిరేక విధానాలు నశించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మహేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో నిర్వహించిన విద్యార్థుల జిల్లా సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి, అర్ అండ్ బి అతిథిగృహం అవరణలో భహిరంగ సభా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలు నశించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విద్య అంశాలు ఇంకా నెరవేర్చక పోవడం సిగ్గు చేటని అన్నారు. ఆదిలాబాద్‌కు రాష్ట్ర స్థాయి యూనివర్సిటీ లేకపోవడం ఇక్కడి ప్రతినిధుల వైఫల్యమని అన్నారు. విద్యార్థుల కోసం నిరంతరం శ్రమ చేస్తూ అనేక పోరాటాలు చేస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం విద్యార్థి పరిషత్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి, భయపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఏబీవీపీ ఎప్పటికీ భయపడేది కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న అనేకసార్లు ఏబీవీపీ విద్యార్థులపైన కేసులు పెట్టి వారిని భయపెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ కార్యకర్త లోక ప్రవీణ్ రెడ్డి, విభాగ కన్వీనర్ మనోజ్, జిల్లా కన్వీనర్ కార్తిక్, పట్టణ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్, ఏబీవీపీ కార్యకర్తలు మహేష్, అక్షయ్, అఖిలేష్, పూర్వ కార్యకర్తలు ఎంద్రాల నగేష్, నాగేందర్ గౌడ్, వెంకట్, మనోజ్ పవర్, ప్రశాంత్, నరేందర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ చేయూత

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని మన్మద్ గ్రామానికి చెందిన మిరియాల ధర్మసాయి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న సమయంలో ఇటీవల అతని కూతురు అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న తన తోటి ఆటో యూనియన్ సభ్యులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆటో యూనియన్ సభ్యులను మన్మద్ గ్రామ ప్రజలు అభినందించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పట్టణంలోని 21, 24వ వార్డులకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, వేములశేఖర్‌లు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న ఎమ్మెల్యే జోగు రామన్న వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహేందర్, శేఖర్, అల్లం మహేందర్, తాటి లక్ష్మణ్, కపిల్ పాల్గొన్నారు.

గర్భిణులకు నెలసరి చికిత్సలు తప్పనిసరి

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంతో పాటు మండలంలోని కనకాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, నెలసరి టీకాలను ఇచ్చారు. గర్భిణులు నెలసరి ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఏఎన్ఎంలు సునీత, దీపలు సూచించారు.

జిల్లా కేంద్రంలో దొంగల బీభత్సం

- పలు వ్యాపార సముదాయాల్లో చోరీకి యత్నం



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో మంగళవారం దొంగలు బీభత్సం సృష్టించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త, పాత బస్టాండ్‌లో ప్రాంతంలో పలు దుకాణాల్లో అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఇండియా వన్ ఏటీఎమ్ ధ్వంసం చేసి చోరికి యత్నించారు. దీంతో ఏటీఎం పాక్షికంగా దెబ్బతింది. గంగా కాంప్లెక్స్‌లో బట్టల దుకాణంలో రూ.10 వేల విలువైన బట్టలు దొంగతనం జరిగినట్లు సమాచారం. అలాగే సమీపంలోని సెల్ పాయింట్ ధ్వంసం చేసి చోరికి విఫల ప్రయత్నం చేశారు. సమీపంలోని మెడికల్ దుకాణం తాళం పగలగొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు దుకాణాలను పరిశీలించారు. క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోవాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని న్యూలోలం గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్డు, ఎరువుల తయారీ, నర్సరీలను, గుండంపెల్లి గ్రామంలోని నర్సరీ, నూతన గ్రంథాలయనిర్మాణం, మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మింస్తున్న గదులను అడిషనల్ కలెక్టర్ హేమంత్ బోర్కాడే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో వర్మీకాంపోస్టు ఎరువుల తయారీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించడం మనందరి బాధ్యతని తెలియజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అందరూ సద్వినియోగ పర్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, పాఠశాల వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, గుండంపల్లి సర్పంచ్ తక్కల సంగీత, న్యూలోలం సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ, ఎంపీడీఓ గడ్డం మోహన్ రెడ్డి, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఉపాధి హామీ ఏపీఓ దివ్య రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటరమణ, వెంకట్ రామ్, పంచాయతీ సెక్రటరీ దిలీప్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందుల మహేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని పర్సవాడ(కె), దాబా(బి)లో క్షేత్ర స్థాయిలో కూలీలు నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపీడీఓ సాయి ప్రసాద్ పరిశీలించారు. కూలీల వివరాలు మాస్టర్‌లో పనులు చేస్తున్న కూలీల హాజరును తనిఖీ చేశారు. పనులు నిర్వహిస్తున్న కూలీల పేర్లు తప్ప, పనిచేయని కూలీల హాజరు వేయవద్దని ఉపాధి హామీ సిబ్బందిని సూచించారు. అదేవిధంగా అర్జునీ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, వంట సరుకులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో పల్లె ప్రగతి, నర్సరీ పనులపై కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాజీ జెడ్పీ చైర్‌పర్సన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ రాజ్‌ను బుధవారం మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు సంతోష్, కిరణ్, లంక శ్రీను, గణేష్ ఉన్నారు.

డీసీపీని మర్యాదపూర్వకంగా కలిసిన జీఎం

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా నూతన డిప్యూటీ కమిషనర్ పోలీస్ సుధీర్ రామ్ నాథ్ కేకన్‌ను బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో జైపూర్ ఏసిపి నరేందర్, మంచిర్యాల ఎసిపి తిరుపతి రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్ పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాలకు సమయానికి రేషన్ బియ్యం అందించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

పేద ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎంఎల్ఎస్ పాయింట్ నుండి ప్రతి నెల సమయానికి చౌకధరల దుకాణాలను రేషన్ బియ్యం, సరుకులు పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎస్. పాయింట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుండి జిల్లాలోని చౌకధరల దుకాణాలకు అందించాల్సిన బియ్యం సరఫరా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చౌకధరల దుకాణాలకు సమయానికి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని, ప్రతి నెల నిర్ణీత సమయానికి లబ్దిదారులకు రేషన్ బియ్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. చౌకధరల దుకాణాలకు కేటాయింపు ప్రకారం అందాల్సిన బియ్యం తక్కువగా ఉన్నట్లయితే ఇతర జిల్లాల అధికారుల సమన్వయంతో తీసుకువచ్చి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండలం సుందరయ్య కాలనీలో నిర్వహిస్తున్న చౌకధరల దుకాణం నెం.17ను తనిఖీ చేయగా బోర్డు లేకపోవడంతో రూ.5వేల జరిమానా విధించడంతో పాటు తగు చర్యలు తీసుకోవాలని నస్పూర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. చౌకధరల దుకాణాలలో చక్కెర పంపిణీ చేసేందుకు సంబంధిత డీలర్లచే చక్కెర కోటా కొరకు డీడీలు కట్టించే బాధ్యత డీటీలదేనని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్ నుండి మండలాల తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఫారం-6బి పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఓటరు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును అనుసంధానం చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో 5 లక్షల 86 వేల 7 మంది ఓటర్లు ఉండగా 4 లక్షల 47 వేల 294 మంది నుండి 76.23 శాతంగా దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. 90శాతానికి పైగా వచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.